ప్రజావాణికి 26 ఫిర్యాదులు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 25 : కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 26 ఫిర్యాదులు వచ్చినట్లు జోనల్ అధికారులు తెలిపారు. జోన్ ఆఫీస్‌లో ప్రజావాణికి 18 ఫిర్యాదులు రాగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి 14, ఇంజినీరింగ్ విభాగానికి 3 , ఎంటమాలజీ విభాగానికి 1 ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా కూకట్‌పల్లి జంట సర్కిళ్ల కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 8 ఫిర్యాదులు వచ్చాయి. మూసాపేట సర్కిల్ పరిధిలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 5 ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి.. సమస్యలను పరిష్కరించనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రతిరోజూ చెత్తను సేకరించాలి

మేడ్చల్, నవంబర్ 25 : ప్రతి రోజూ డోర్ టూ డోర్ చెత్త సేకరించాలని సిబ్బందికి మేడ్చల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మర్రి దీపి కా నర్సింహారెడ్డి సూచించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం చెత్త సేకరణపై సిబ్బందితో చైర్‌పర్సన్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త సేకరణలో సిబ్బంది అలసత్వాన్ని సహించమన్నారు. ప్రతి వీధి, ఇంటి నుంచి చెత్తను సేకరించాలని సూచించారు. తడి, పొడి, హానీకరమైన చెత్తను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చెత్త సేకరణ వాహనాలు మరమ్మతులకు గురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలన్నారు. నీటి సరఫరా విషయంలో వాటర్‌మెన్‌లు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ఏఈ సుందర్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విగ్నేశ్, మున్సిపాలిటీ జవాన్లు, డ్రైవర్లు, వాటర్‌మెన్ పాల్గొన్నారు.

నిజాంపేట్‌లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- చోద్యం చూస్తున్న అధికారులు
- అక్రమార్కులకు అండగా నిలిచి దండుకుంటున్న అధికార పార్టీ యువ నేత

దుండిగల్, నవంబర్ 25 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా అధికారులు చర్యలు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు సర్వత్రా వినవస్తున్నాయి. కిందిస్థాయి సిబ్బంది సహకారంతో కొందరు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉంటే అక్రమార్కులకు అధికార పార్టీకి చెందిన ఓ యువనేత అండగా నిలుస్తూ అందినకాడికి దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఫలితంగా నిజాంపేట్ మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి సదరు యువ నేత భారీగానే గండికొడున్నాడనే విషయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్‌ల్లో ఎక్కడ చూసినా పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. గత కొంతకాలంగా ఇక్కడి టౌన్‌ప్లానింగ్ విభాగంలో స్థిరమైన అధికారి లేకపోవడంతో సిబ్బంది(చైన్ మెన్)లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. దీంతో సదరు సిబ్బంది ఆడిందే ఆట అన్నట్లు తయారైంది. తరచూ కార్పొరేషన్ కమిషనర్ బదిలీ కావడం సిబ్బందికి కలిసి వస్తున్నది. ఎక్కడ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయే తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో సిబ్బంది సైతం తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

దండుకుంటున్న యువ నేత

ఓ వైపు అధికార పార్టీ యువ నేత, మరో వైపు మున్సిపల్ సిబ్బంది అక్రమార్కులను నుంచి దండుకుంటూ కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నట్లు తెలుస్తున్నది. ఇందుకు బాచుపల్లిలోని జీపీఆర్ లే అవుట్‌లో ఓ వ్యక్తి నాలుగువందల గజాల స్థలంలో జీ+2కు అనుమతులు పొంది ఏకంగా జీ+6 అంతస్తులు నిర్మిస్తున్నాడని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నిర్మాణానికి అధికార పార్టీ యువ నేత అండగా ఉండటంతో అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తున్నది.సదరు యువ నేతకు నియోజకవర్గ స్థాయి నాయకుడి అండదండలు ఉండటంతో అధికారులు అటువైపు చూడటం లేదన్న ఆరోపణలు లేకపోలేదు.

బాచుపల్లిలోని జీపీఆర్ లే అవుట్‌లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణం

ఇక పూర్తిగా మురికి వాడ అనుకున్న రాజీవ్‌గాంధీనగర్, ఎన్‌టీఆర్ నగర్(191)లోనూ ఐదంతస్తుల మేడలు వెలుస్తున్నాయంటే ఆశ్చర్యం కలుగకమానదు. ఏదేమైనా ఇటీవల సిద్ధిక్‌నగర్‌లో జరిగిన ఘటనను చూసైనా సంబంధిత అధికారులు అక్రమ నిర్మాణాలకు బ్రేక్ వేయాలని నిజాంపేట్ కార్పొరేషన్ ప్రజలు కోరుతున్నారు.

సీఎం సహాయ నిధితో పేదలకు మెరుగైన వైద్యం

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 25 : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో అల్లాపూర్ డివిజన్‌కు చెందిన సాయిరామ్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ. 75వేల చెక్కును లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు ప్రభుత్వం సాయం చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నేరేడ్‌మెట్: రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రాచకొండ ఎస్‌వోటీ డీసీపీ మురళీధర్ గారి సూచనల మేరకు ఏహెచ్‌టీయూ రాచకొండ ఆధ్వర్యంలో వినాయక నగర్‌లోని జడ్పీ హైస్కూల్‌లో సైబర్‌నేరాలు, మానవ అక్రమరవాణాపై ఏహెచ్‌టీయూ ఎస్సై కె. రాములు నాయక్, ఏఎస్ఐ వెంకటస్వామి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ మోసాలకు గురైతే సైబర్ క్రైం 1930 డయల్ చేయాలని సూచించారు.

విజ్ఞాన ప్రదర్శనలు

ఉప్పల్, నవంబర్ 25: విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాతను పెంపొందిస్తాయని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ అన్నారు.డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. సైన్స్ ఫెయిర్ ఏర్పాటుకు సహకారం అందించిన ఎన్‌జీఓ ఆగస్త్యను కార్పొరేటర్ అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, స్కూల్ ప్రిన్సిపాల్ అంజిరెడ్డి, నేతలు కొండల్‌రెడ్డి, జగన్, శేఖర్, మహమ్మద్, శ్రీనివాస్, అశోక్‌చారి, షఫి, ఎన్‌జీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 25: క్రిస్మస్ వేడుకలు-2024 కార్యక్రమాల్లో భాగంగా అర్హులైన అభ్యర్థులు, సంస్థలను గౌరవించుటకు నిర్ణయించిందని, అందుకు అర్హులైన క్రైస్తవ అభ్యర్థులు, సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కె.వీణ ఒకప్రకటనలో తెలిపారు. సామాజిక సేవరంగం, వైద్య సేవలు, విద్యాబోధన, సాహిత్యం, కళలు, క్రీడా రంగాల్లో విశేషమైన సేవలందించిన క్రైస్తవులు 30 సంవత్సరాల (వ్యక్తులు) 10 సంవత్సరాల పైబడి సేవ చేస్తున్న క్రైస్తవ సంస్థలు అర్హులను తెలిపారు. అర్హులైన అభ్యర్థులు, సంస్థలు డిసెంబర్ 5వ తేదీలోపు కలెక్టరేట్‌లోని మైనార్టీ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు WWW.TSCMFC.IN వెబ్‌సైట్‌లో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో పొందవచ్చు.

అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం

మేడ్చల్ రూరల్, నవంబర్ 25: మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామంలోని హరహర నందన అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మల్లారెడ్డి గురు స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 25 : కేపీహెచ్‌బీ కాలనీ విద్యుత్ సెక్షన్ పరిధిలో లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విజయప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేపీహెచ్‌బీ కాలనీ 2,3వ రోడ్లలో, యూనియన్ బ్యాంక్, బుధవారం మార్కెట్ ఏరియాలో, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 3 గంటల వరకు కేపీహెచ్‌బీ కాలనీ 4,5 రోడ్లలో, మమత వైద్యశాల, సుబ్బయ్య హోటల్, ప్రతిభ స్కూల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

భాగ్యనగర్ కాలనీలో..

భాగ్యనగర్ సెక్షన్ పరిధిలో లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అడ్డగుట్ట వాటర్‌ట్యాంక్, శాతవాహన కాలనీ రోడ్డులో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జగద్గిరిగుట్ట పరిధిలో..

జగద్గిరిగుట్ట : మరమ్మతుల కారణంగా మంగళవారం పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ రాధాకిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్ఎంటీ సబ్‌స్టేషన్ పరిధి హెచ్ఎంటీ, చింతల్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు చంద్రానగర్, చింతల్, శివనగర్, రంగానగర్, సాయినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించాలని సూచించారు.

గౌరీశంకర ఆలయంలో మానసాదేవి హోమం

దుండిగల్, నవంబర్ 25 : కార్తికమాసం చివరి సోమవారం కావడంతో శివయ్యను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. నియోజకవర్గంలోని పలు శైవ క్షేత్రాల్లో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నసమారాధన చేశారు. ప్రగతినగర్‌లోని పట్టాభి రామాంజనేయ స్వామి దేవస్థానంలోని గౌరీశంకర స్వామి ఆలయంలో మానసాదేవి హోమం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలంగౌడ్, మాడుగుల నాగఫణిశర్మ, సినీనటుడు సుమన్ పూజలు చేయగా, ఆలయ కమిటీ చల్లా చైర్మన్ సుధీర్‌రెడ్డి, సెక్రటరీ ధనరాజ్‌యాదవ్, అరవింద్ వెంకట్‌రెడ్డి, ఉమా, జయ, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించండి..

కార్పొరేటర్ సబీహాబేగంకు వినతిపత్రం అందజేస్తున్న బొల్లు శ్రీనివాస్‌రావు తదితరులు

అల్లాపూర్, నవంబర్ 25 : శ్రీవివేకానందనగర్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బిల్లు శ్రీనివాస్‌రావు సోమవారం వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ సబీహాబేగంకు వినతిపత్రం అందజేశారు. సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, స్ట్రీట్‌లైట్లు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌ను కోరారు. సమస్యలను ఎమ్మెల్యే కృష్ణారావు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో మధుసూధనాచారి, రోశయ్య తదితరులు ఉన్నారు.

అందమైన చేతిరాతతో మెరుగైన ఫలితాలు

గిరినగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చేతిరాతపై అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు

జగద్గిరిగుట్ట, నవంబర్ 25 : అందమైన చేతిరాత అలవరచుకుంటే పరీక్షల్లో మెరుగైన ఫలితాలు పొందవచ్చని ఉపాధ్యాయులు సూచించారు. రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం చేతిరాత ఉచిత శిక్షణ ప్రారంభించారు. వారంపాటు అవగాహన కల్పిస్తున్న జితేందర్ అకాడమీ బృందానికి ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకుడు వంపు మల్లయ్య, హెచ్ఎం చంద్రయ్య, ఉపాధ్యాయులు అనిత, స్వప్న, రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ. 2లక్షల విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కును అందజేస్తున్న వీ.చంద్రశేఖర్

దుండిగల్, నవంబర్ 25 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మధురానగర్ కాలనీలో అష్టలక్ష్మీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా ధ్వజస్తంభ ఏర్పాటు కోసం కాలనీకి చెందిన భక్తులు వీ.చంద్రశేఖర్, ఆయన కుమారులు రూ. 2లక్షలు విరాళంగా అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును సోమవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించడం సంతోషంగా ఉందని ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

మల్లాపూర్, నవంబర్ 25: కాలనీల్లో దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతామని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం ఓల్డ్ మల్లాపూర్, పిట్టల బస్తీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యుత్ ఏఈ నాగరాజుతో కలిసి కాలనీలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఒరిగిన స్తంభాలను పరిశీలించారు. సమస్యలను పరిష్కరించాలని ఏఈకి సూచించారు. ఏఈ ప్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి పాల్గొన్నారు.

ఆర్‌కే ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

దుండిగల్, నవంబర్ 25: పార్కు స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నించడంతోపాటు అడ్డుకోబోయిన సిద్ధి వినాయకనగర్ ఓనర్స్ అసోషియేషన్ సభ్యులపై దాడికి యత్నించిన ఆర్‌కే ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అధికారులను కోరారు. ఆర్‌కే ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యం ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, సిద్ధివినాయక నగర్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి సోమవారం గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డిని కలిసి సమస్యను వివరించారు. పార్కు చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలని, కాలనీని అభివృద్ధి చేయాలని వారు డీసీకి వినతిపత్రం అందజేశారు.

కీసరగుట్టలో కార్తిక పూజలు

కీసర, నవంబర్ 25: కార్తికమాసం చివరి సోమవారం కావడంతో కీసర గుట్టకు భారీగా భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచి స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. శివనామస్మరణతో కీసర గుట్ట మారుమోగింది. మూల విరాట్ స్వామివారికి తేనె, ఆవుపాలు, పంచామృతంతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. కీసరగుట్టకు పరిసర ప్రాంతాల్లో ఉన్న శివలింగాలకు భక్తులు అభిషేకాలను నిర్వహించారు.

రేపు జాబ్ మేళా

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 25: అల్వాల్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 27న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు.10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డీ-ఫార్మా, బీ-ఫార్మా, ఎం-ఫార్మా చదివిన,ఆసక్తి గల యువతి, యువకులు WWW.NIC.GOV.IN పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకొని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు.

ఎంఎల్ ఆర్ఐటీఎం కళాశాలలో ఈ-సమ్మిట్

- రోబోట్ 2.0 ప్రారంభం

ఈ-సమ్మిట్‌లో పాల్గొన్న అతిథులు, కళాశాల యాజమాన్యం

దుండిగల్,నవంబర్ 25 : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మర్రి లక్ష్మణరెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఎంఎల్ఆర్ఐటీఎం) కళాశాలలో సోమవారం ఘన ఈ-సమ్మిట్, రోబోట్ 2.0 కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేశంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, పరిశోధకులు, పారిశ్రామిక నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. యువతలో సామాజిక బాధ్యతను పెంచడంలో ఇలాంటి కార్యక్రమాలు ప్రాముఖ్యత వహిస్తాయన్నారు. వినియోగదారుల సంక్షేమం కోసం సాంకేతికతను ఉపయోగించడం నేటి సమాజానికి అవసరమన్నారు. ఈ-సమ్మిట్, రోబోట్ 2.0 వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆవిష్కరణ శక్తిని వెలికితీయడానికి ఒక వేదికగా పనిచేస్తాయని పేర్కొన్నారు. సదస్సులో వర్క్‌షాప్‌లు, స్టార్టప్ ఎక్స్‌పో, ఐడియా థాన్, మాక్ ఇంటర్వ్యూలు, ప్యానల్ చర్చలు, కెరీర్ గైడెన్స్ వంటి అనేక కార్యక్రమాలతో పాటు రోబోట్ 2.0లో లైన్ ఫాలోయింగ్ రోబో,రోబో సాకర్, జలవిహార్, రోబో రేస్, రోబో సుమో వంటి పోటీలు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం కన్జ్యూమర్ ఎఫైర్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ డీఎస్ చౌహాన్, ప్రొఫెసర్ బీజన్‌కుమార్ మిశ్రా, పల్లే సృజన వ్యవస్థాపకులు బ్రిగేడియర్ పీ.గణేశం, బ్రిమ్-ఎక్స్ వెంచర్స్ వ్యవస్థాపకుడు చైతన్య చిరుమామిళ్ల, ఏఐఆర్ఏ చైర్మన్ కిషన్ పీఎస్‌వీతోపాటు ఎంఎల్ఆర్ఐటీఎం డైరెక్టర్ డాక్టర్ పీ.శ్రీధర్,ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మురళీ ప్రసాద్, కన్వీనర్ డాక్టర్ జీ.అమర్నాథ్, విద్యార్థుల సంఘ అధ్యక్షుడు మాధవ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- దివ్యాంగులకు రూ. 6 వేల పింఛన్ అందించాలి
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 25: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ అందించాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్ డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్, డీఆర్ఓలకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వికలాంగులకు రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ. 4వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చిదని, అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటినా ఎందుకు అమలు చేయలేదని, పింఛన్ పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దివ్యాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగిస్తూ గత ప్రభుత్వం జీవో 34 ఇచ్చిందని, జీఓను ఎందుకు అమలు చేయడం లేదని అన్నారు. ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రైవేట్ పరిశ్రమల్లో నిరుద్యోగ దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చంద్రమోహన్, నాయకులు మల్లేష్, లక్ష్మీపతి, బాలయ్య, శివ,రమేష్, గంగారెడ్డి, కోటయ్య, బ్రహ్మయ్య, నిరాజారెడ్డి, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కార్తిక వన భోజనాలు

కార్తిక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని నగరంలో పలుచోట్ల వన భోజనాలు నిర్వహించారు. శివ పార్వతులు, విష్ణుమూర్తికి ప్రీతి పాత్రమైన మాసం కావడంతో భక్తులు ముందుగా శివారాధన చేసి, బంధువులు, స్నేహితులను పిలిచి వన భోజనాలు నిర్వహించారు. నగర శివారు గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్యాంపస్‌లోని షిమ్లా మైదానంలో ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేసి, ఆ చెట్టు నీడన అంతా కలిసి భోజనాలు చేశారు. ప్రకృతితో ఉన్న బంధాన్ని తెలియజెప్పేలా ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగాయి.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 25: హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించి వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి వార్డెన్‌ను ఆదేశించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ బీసీ బాలుర, ఎస్సీ బాలికల, ఎస్సీ బాలుర, గిరిజన బాలికల పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లన్లు అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వంటశాలను, స్టోర్ రూంలో కలియ తిరిగి పరిశీలించారు. తడి లేకుండా సామగ్రిని నిల్వ ఉంచాలని ఆదేశించారు. హాస్టళ్లలో కల్పిస్తున వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ రజని, జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ ధికారి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 25 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో సోమవారం కూరగాయల ధరలు కింది విధంగా ఉన్నాయి.(కేజీ-రూపాయల్లో..) టమాట 35, వంకాయ 40, బెండకాయ 40, పచ్చిమిర్చి 28, బజ్జిమిర్చి 33, కాకరకాయ 23, బీరకాయ 38, క్యాబేజి 28, ఫ్రెంచ్ బీన్స్ 50, క్యారెట్ 60, కాలీఫ్లవర్ 23, దొండ 40, చిక్కుడు 55, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 45, క్యాప్సికం 65, ఆలుగడ్డ 37, కీరదోస 21, దోసకాయ 28, సొరకాయ 20, పొట్లకాయ (1) 23, కందగడ్డ 60, ఉల్లిపొరక 45, ఉల్లిగడ్డ 45, చింతకాయ-, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 35, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 14 నుంచి 16, పచ్చి బఠాని-, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 160, వెల్లుల్లి 400, చింతపండు 140, కరివేపాకు 70గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు ర